AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
2-3-2026 (Monday) | MAIN EDITION

## అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ దాడి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తమపై దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, ఆస్తులపై క్షిపణుల వర్షం కురిపిస్తోంది. యూఏఈలోని అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ దాడి చేసింది. దీంతో డేటా సెంటర్ భారీగా దెబ్బతింది. తన భూభాగంపై ఇరాన్ క్షిపణి దాడులు చేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ టెహ్రాన్‌లోని తన రాయబార కార్యాలయాన్ని మూసివేసినట్లు ప్రకటించింది.

## భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం



**అక్షరటుడే, హైదరాబాద్:** వేసవి ప్రారంభంలోనే రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ డిమాండ్ 6273 మెగావాట్లు చేరుకున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గరిష్ట డిమాండ్ 6,267 మెగావాట్లు నమోదు కాగా.. నేడు దానిని బ్రేక్ చేస్తూ.. 6,273 మెగావాట్లకు చేరడం గమనార్హం. విద్యుత్ డిమాండ్ పెరుగుదల ప్రధానంగా వేసవి వేడి తీవ్రత కారణంగా ఉందని సీఎండీ తెలిపారు. వినియోగదారులకు అసౌకర్యం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై అఫ్గాన్ దాడి



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పాకిస్థాన్ - అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఇరుదేశాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. తమ వైమానిక దళం పాక్‌లోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడులు చేపట్టినట్లు అఫ్గాన్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. పలు కీలకమైన పాక్ సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది.

## హెజ్‌బొల్లా కీలక నేత మృతి




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లాకు చెందిన కీలక నేత మృతి చెందినట్లు సౌదీ వార్తా సంస్థ అల్-హదత్ పేర్కొంది. ఉగ్రసంస్థకు చెందిన మరికొందరు ఉన్నతాధికారులు కూడా తమ దాడుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు ఐడీఎఫ్ తెలిపింది.

## కంట్రోల్ రూం ఏర్పాటు



**అక్షరటుడే, ఢిల్లీ:** పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో దీనిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సీనియర్ అధికారులు పరిస్థితిని విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరుపుతున్నారు.




**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. చమురు రవాణాకు ఎంతో కీలకమైన హర్ముజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకుంది. దీంతో ధరలు 10 శాతం పెరిగాయి. చమురు సరఫరా పూర్తిగా నిలిచిపోతే మన పరిస్థితి ఏమిటన్న సందేహం సామాన్యులను పీడిస్తోంది. అయితే దేశంలో సుమారు రెండున్నర నెలల వరకు సరిపడా చమురు నిల్వలు ఉన్నట్లు సమాచారం.**

-అక్షరటుడే, నేషనల్ డెస్క్

# భగ్గుమంటున్న చమురు ధరలు

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ఆయిల్ సరఫరాపై ప్రభావం
- భారత్‌పై పడనున్న భారం
- దేశంలో 74 రోజులకు సరిపడా నిల్వలు

అమెరికా, ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఘర్షణ పశ్చిమాసియాను ఉద్రిక్తతల్లోకి నెట్టింది. యూఎస్, ఇజ్రాయిల్ కలిసి చేసిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఇరాన్ గల్ఫ్ దేశాలలోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తుండడంతో పరిస్థితి మరింత దిగజారుతోంది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన "హార్ముజ్ జలసంధి"ని ఇరాన్ మూసివేయడంతో చమురుతోపాటు సరుకుల రవాణా స్థంభించాయి. దీంతో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. మరోవైపు యుద్ధం మరో నాలుగైదు వారాలపాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.

### సగానికిపైగా హార్ముజ్ జలసంధి ద్వారానే..

మన దేశం ముడి చమురు కోసం 85 శాతానికిపైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. హార్ముజ్ జలసంధి ద్వారానే యాభై శాతానికిపైగా చమురు దిగుమతి అవుతోంది. ఈ నేపథ్యంలో ముడిచమురు సరఫరా నిలిచిపోతే పరిస్థితి ఏమిటన్న సందేహాలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. అయితే ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి మన దేశం సిద్ధంగా ఉంది. ఇప్పటికే పెట్రోలియం నిల్వలను భారీగా పెంచింది.

### రెండున్నర నెలలకు సరిపడా..

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుతం మన దేశంలో 74 రోజుల వినియోగానికి సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం చాలా అభివృద్ధి చెందిన దేశాలు 90 రోజుల నిల్వను లక్ష్యంగా పెట్టుకుంటాయని, భారత్ కూడా త్వరలోనే ఈ లక్ష్యాన్ని చేరుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం మన దేశం వ్యూహాత్మక నిల్వలను తొలి దశలో 3 ప్రధాన ప్రాంతాలలో ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో భూగర్భ గుహల్లో ముడి చమురును భద్రపరుస్తున్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రం మంగళూరు పశ్చిమ తీరంలో, అదే రాష్ట్రంలోని పాడూరులో నిల్వ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం హార్ముజ్ జలసంధి మూతపడినా రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో యుద్ధం కొనసాగినా ఇప్పటికప్పుడు భారత్‌కు ఇబ్బందులు లేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### 81.87 డాలర్లకు..

యుద్ధ భయాలతో ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్ఛేంజీలో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ఏప్రిల్ కాంట్రాక్ట్ ఒక బ్యారెల్‌కు 10 శాతం పెరిగి 81.87 డాలర్ల గరిష్ఠానికి చేరింది. ఫ్యూచర్స్‌లో బ్రెంట్ క్రూడ్ 13 శాతం పెరిగి 82.37 డాలర్లకు చేరింది. 2025 జనవరి తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. పలు చమురు ట్యాంకర్లపై ఇరాన్ దాడులు చేసింది. దీంతో ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఉత్పత్తి, రవాణాపై ప్రభావం పడితే రేట్లు మరింత పెరగనున్నాయి.

### రూ.13 వేల కోట్ల భారం


ప్రపంచంలో ముడి చమురు కొనుగోలుదారుల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. దేశంలో రోజుకు 5.5 మిలియన్ల బ్యారెళ్ల ముడి చమురు వినియోగిస్తున్నారు. ఇందులో 1.5 నుంచి 2 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ హార్మూజ్ జలసంధి నుంచే వస్తోంది. రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గించడంతో భారత్ పశ్చిమాసియాపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక డాలర్ పెరిగినా.. భారత ప్రభుత్వం ఏడాదికి రూ.13వేల కోట్ల భారం పడుతుంది.



## అన్నారం బ్యారేజీ కూల్చేందుకు కుట్ర..


**అక్షరటుడే, హైదరాబాద్:** మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్సవేటర్లతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని విమర్శించారు. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్‌ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్‌పై బురదజల్లే పన్నాగాలపై విచారణ జరిపించాలన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ అరాచకాలు చేస్తోందన్నారు.

## ఫినో బ్యాంక్ సీఈవోకు రిమాండ్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ఫినో బ్యాంక్ సీఈవో రిషి గుప్తాను డీజీజీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆన్లైన్లో గేమింగ్ సిండికేట్పై రిషి గుప్తాను అరెస్ట్ చేశారు. ఆన్లైన్ గేమింగ్ నిర్వహణలో జీఎస్టీ ఎగ్గొట్టినట్లు అధికారులు గుర్తించారు. దీంతో కేంద్ర వస్తు సేవల పన్ను చట్టంలోని సెక్షన్ 132(1)(a), రాష్ట్ర జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 132(1) (i) కింద అరెస్టు చేశారు. కాగా.. బ్యాంక్ కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగుతాయని, సేవలపై ఎటువంటి ప్రభావం ఉండదని సంస్థ తెలిపింది.

## రాష్ట్రంలో మండనున్న ఎండలు




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగింది. ఇటీవల అల్పపీడనంతో తగ్గిన ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. పగటి పూట వేడి అధికంగా ఉంటుంది. దీంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. మార్చిలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం నుంచి భానుడు తన ప్రతాపం చూపుతాడని పేర్కొన్నారు. ముఖ్యంగా మార్చి 3 నుంచి 7 వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 3941 డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలో 36 నుంచి 37 డిగ్రీల టెంపరేచర్ నమోదయ్యే ఛాన్స్ ఉంది. మిగతా జిల్లాల్లో 37 నుంచి 39 డిగ్రీల వరకు ఉండనుంది.


## వాటి వెనుక ఏదో ఒక ఉద్దేశం ఉంది: అదితీరావు



**సోషల్ మీడియాలో సెలబ్రిటీల మీద ప్రస్తుతం జరుగుతున్న దాడిపై నటి అదితీరావు వినూత్నంగా స్పందించారు. ఎవరో కావాలని ఒక ఎజెండాతో తప్పడు వార్తలను వ్యాప్తి చేస్తున్నారని, అవి చూసినప్పడు తనకు చాలా ఆశ్చర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. 'నా గురించి కూడా కొన్నిసార్లు చెత్త వార్తలు వస్తుంటాయి. కానీ వాటి వెనుక ఏదో ఒక ఉద్దేశం ఉంటుందని నాకు తెలుసు, అందుకే వాటిని లైట్ తీసుకుంటాను. నన్ను తొక్కేయాలని చూసినా పట్టించుకోలేదు" అని ఆమె పేర్కొన్నారు.**

- అక్షరటుడే, సినిమాడెస్క్

## ఎల్‌బీ నగర్‌లో కారు దగ్ధం..



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వెళ్తూ ఓ లారీని డివైడర్‌ను ఢీకొంది. అనంతరం కారు దగ్ధమైంది. ఎల్‌బీనగర్‌లోని సాగర్ రింగ్ రోడ్డు బ్రిడ్జిపై ఆదివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాక్ టౌన్ కాలనీకి చెందిన సాయి కీర్తన్ రెడ్డి (24) తన కారులో అర్ధరాత్రి వెళ్తున్నాడు. అతివేగం, అజాగ్రత్తగా డ్రైవ్ చేస్తూ.. సాగర్ రింగ్ రోడ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పై లారీని ఢీకొట్టాడు. అనంతరం కారు పల్టీలు కొట్టి డివైడర్‌ను, రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారులో మంటలు చెలరేగాయి. దీంతో పూర్తిగా దగ్ధమైంది. అయితే సాయికీర్తన్ రెడ్డి ముందుగానే బయటకు రావడంతో అతడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

## దివ్యాంగులకు ఉచితంగా బస్సు ప్రయాణం



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ జీవో జారీ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహాలక్ష్మి పథకం అమలు చేసిన విషయం తెలిసిందే. గతంలో దివ్యాంగులకు ప్రభుత్వం రాయితీ బస్ పాస్‌లు ఇచ్చింది. ఆ పాస్ చూయిస్తే బస్సులో 50 శాతం రాయితీ టికెట్లు ఇచ్చేవారు. అయితే రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో దివ్యాంగ మహిళలు దానిని వినియోగించుకుంటున్నారు. రాయితీ పాస్‌లు తీసుకోవడం మానేశారు. అయితే తమకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కొంతకాలంగా దివ్యాంగ పురుషులు కోరుతున్నారు. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీరికి ఫ్రీ బస్సు అమలు చేయనున్నట్లు తెలిపింది. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.